# నిజ నిర్వచనం

-తొత్తడి గణపతిరావు



"సార్...రిక్షా కావాలా?''

"అక్కర్లేదు''

"ఎక్కండి సార్ ఎండమండిపోతోంది. మీకు తోచింది ఇవ్వండి''

"అక్కర్లేదు...చెప్పాను కదా''

"ఉదయం నుంచి బోణీలేదు. టీ కూడా తాగ లేదు ఎక్కండి సార్''

"ఒద్దు బాబూ! అక్కర్లేదని చెప్పాను కదా?'' విసుగును ఆపుకోలేకపోయాను.

వాడివైపు చూస్తే మళ్ళీ ఏ మొగమాటం ముంచుకొస్తుందోనని ముఖం దించుకుని గబగబా ముందుకు నడిచాను. నిజానికి అక్కడికి మా ఆఫీసు కేవలం వందగజాల దూరంలో ఉంది. రిక్షా ఎక్కాల్సిన అవసరం లేదు. ఓ పదడుగులు వేశాక వెనక్కి తిరిగి చూశాను. రిక్షా వాడు భారంగా రిక్షా లాక్కుంటూ వస్తున్నాడు ఏదో గొణుక్కుంటూ.

మర్మవయసు, మాసిన గడ్డం, చిరుగుల బనియన్. వేసవికాలం తొమ్మిది గంటలకే ఎండ తన ప్రతాపం చూపిస్తోంది. అతను రిక్షాలాగే తీరు చూస్తుంటే నిజంగా అతను ఇంతవరకు టీ తాగలేదేమో అన్పించి జాలి కలిగింది.

పొరపాట్న ఇప్పుడేదైనా జ్వరం తగిలినా కక్కుర్తికి ఎక్కించుకుని లాగినా కళ్ళు తిరిగి పడిపోడూ అనుకున్నాను జాలిగా.

పిలిచి పదిరూపాయల నోటు ఇవ్వబోయాను.

"ఒద్దు సార్. మీరు రిక్షా ఎక్కలేదు కదా!'' నిజాయితీగా అన్నాడు.

"ఎక్కలేదులే. ఫర్వాలేదు టీ తాగు కాస్త ఓపిక వస్తుంది'' అంటూ నోటు అతని చేతిలో కుక్కి మేడమెట్లెక్కేశాను.

వెనకనుంచి రిక్షావాడి పిలుపు విన్పిస్తోంది.

ఓ పదిరోజులు గడిచాయి. ఓ ఫ్రెండు వస్తున్నాడంటే రిసీవ్ చేసుకోవడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్లాను. ట్రైన్ వచ్చింది వాడు రాలేదు. మనసు చికాగ్గా ఉంది. సమయానికి పెద్ద దాని స్కూల్ ఫీజు కట్టేందుకు వెయ్యి తగ్గాయి. ఎవర్నడిగినా మొండి చెయ్యి చూపించారు. దాంతో మా ఆవిడ రెచ్చిపోయి రేడియో విప్పింది.

"ఏవో నాలుగు కబుర్లు చెప్పి ఓ కథ చెబితే బాబు జాలిపడి వందలు, వేలు ధారబోస్తారు. చూశారా ఇప్పుడు అవసరానికి ఒక్కడైనా పైసా విదిలించాడా? అసలు మీ దగ్గర డబ్బు తీసుకున్న పదిమందిలో ఆరుగురు మీకంటే స్థితి పరులే. మిగతా నలుగురూ కల్లబొల్లి కబుర్లు చెప్పి లేని సమస్యలు సృష్టించో ఉన్న సమస్యను పదింతలు చేసి చెప్పో మిమ్మల్ని బుట్టలో వేసినవాళ్ళే. మీకెప్పుడు జ్ఞానోదయం అవుతుందో మరి నాకు తెలియదు''

మా ఆవిడ మాటలు నా చెవిలో మారుమ్రోగుతున్నాయి. మా ఆవిడ చెప్పిన దాంట్లోనూ నిజం ఉందనిపించింది. నేనూ గమనిస్తున్నాను. అప్పు తీసుకున్నప్పుడు చెప్పే కథలు కేవలం కథలే అని తర్వాత తెలుస్తూనే ఉంది. అంతేకాక తీర్చమని అడిగితే తీర్చాలనే బాధ్యత అసలు చూపడం లేదు సరికదా కనీసం కృతజ్ఞత కూడా చూపించకుండా అడిగినందుకు చికాకుపడిపోతున్నారు కొందరు.

టైం దగ్గర దగ్గరగా పదవుతోంది. అమ్మో...ఆఫీసు ఇక్కడికో రెండు కిలోమీటర్లయినా ఉంటుంది. రిక్షా పిలిచి ఎక్కి కూర్చున్నాను పోనీ అంటూ. రిక్షా కదిలింది. ఆఫీసు వచ్చింది. "సార్...ఆఫీసుకొచ్చేశారు దిగండి'' అంటూ రిక్షా వాడు గుర్తుచేస్తే ఆలోచనల నుంచి తేరుకుని దిగాను. పదిరూపాయల నోటు వాడి చేతిలో పెట్టబోతే "వద్దు బాబూ. మొన్న మీకు పదిరూపాయలు బాకీపడ్డాను. మళ్లీ మనం కలుసుకోలేదు ఆలీసం అయిపోయింది'' అంటూ వాడు నేనిచ్చిన పదిరూపాయలు తీసుకోకుండా వెనక్కి తిరుగుతుంటే చూశాను. 'అవును ఆ వేళ బోణీకాలేదు టీ తాగుతాను అంటే జాలిపడి పదిరూపాయలిచ్చాను. అది బాకీగా తలచి తీరుస్తున్నాడన్నమాట.

ఆహా ధర్మదేవతా నీకు ఆఖరికి ఇలాంటి బీద వాళ్ళ ఆశ్రయమే దొరికిందన్నమాట' అనుకున్నాను.

★